ఆశల అన్వేషణ..

వర్షాలు పడితే చాలు ప్రతి ఒక్కరూ వేట షురూ చేస్తారు. అది మామూలు వేట కాదు.. వజ్రాల వేట. వర్షం తమకు అదృష్టాన్ని తీసుకొస్తుందా? లేదా? అని ఆశగా చూస్తుంటారు. సాధారణంగా వర్షాకాలం మొదలైందంటే అన్నదాతలు ఆకాశం వైపు చూస్తారు. చినుకు పడితే చాలు వారి ఆనందానికి అవధులు ఉండవు. కానీ అక్కడ మాత్రం రైతులతో పాటు సామాన్య ప్రజలు, ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి వజ్రాల కోసం అన్వేషిస్తుంటారు. వరుణ దేవుడి రాక కోసం ప్రార్థనలు చేస్తారు. ఒక్క తొలకరి వర్షంతో లక్షాధికారులు, కోటీశ్వరులు అయిపోవాలనే ఆశతో వజ్రాల అన్వేషణ చేస్తుంటారు. తొలకరి వర్షాలతో భూ ఉపరితలంపై ప్రత్యక్షమయ్యే వజ్రాల కోసం పత్తికొండ, తుగ్గలి, మద్దికెర ప్రాంతాలకు వేలాది మంది తరలివస్తుంటారు. కర్నూలు, అనంతపురం, మహబూబ్ నగర్, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి సైతం ఈ వజ్రాలను వెతికేందుకు కార్లు, ప్రత్యేక వాహనాల్లో ఆశగా వస్తున్నారు.





జొన్నగిరి వద్ద పొలాల్లో వజ్రాల కోసం వెతుకుతున్న ప్రజలు

- తొలకరి వర్షం కోసం ఎదురుచూపు
- వజ్రాల కోసం వేలాదిగా వస్తున్న జనం
- బస్టాండ్, ఆలయాల ప్రాంగణాలే వారి ఆవాసాలు
- పత్తికొండ ప్రాంతానికి వేలాదిగా వస్తున్న ఆశావహులు

పత్తికొండ, మే27 (ఆంధ్రజ్యోతి): ఒక్కరాయి దొరికితే తలరాత మారిపోతుంది. తమకష్టాలను తీర్చే అవిలువైన రాళ్ల కోసం అక్కడి పంటపొలాల్లో ఒళ్లంతా కళ్లుచేసుకుని వెతుకులాట సాగిస్తుంటారు. మట్టిలో దాగిఉన్న తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వందల మైళ్ల దూరం నుంచి ఆశల అన్వేషణకు ప్రజలు తరలివస్తుంటారు. పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని తుగ్గలి, మద్దికెర మండలాల పరిధిలోని ఎర్రగుడి, జొన్నగిరి, చిన్నజొన్నగిరి, పగడిరాయి, అమినేబాద్, తుగ్గలి, మదనంతపురం, పెరవలి పంట పొలాల్లో విలువైన వజ్రాలు దొరుకుతుంటాయి. ఇక్కడి నేలల్లో నేలపొరల్లో వజ్రాలు, బంగారు నిక్షేపాలు దాగి ఉండడమే అందుకు కారణంగా శాస్త్రవేత్తలు పరిశోధనల ద్వారా తేల్చిచెప్పారు. భూమిపొరల్లో మార్పులు సంభవించినప్పుడు కొన్ని వజ్రాలు ఉపరితలానికి చేరుకుంటాయని శాస్త్రవేత్తలు సైతం ధృవీకరించారు. పంటపొలాలను రైతులు దుక్కి దున్నినప్పుడు ఇక్కడి నేలలో దాగి ఉన్న వజ్రాలు బయటకు కనిపిస్తుంటాయి.

భూమిలో దాగి ఉన్న నిక్షేపాలు

ఎర్రగుడి నుంచి తుగ్గలి వరకు ఎస్ ఆకారంలో ఉన్న బంగారు నిక్షేపాలపై 1990 నుంచే కేంద్ర ప్రభుత్వం పలు పరిశోధనలు చేసింది. అందుకు సంబంధించి బంగారు నిక్షేపాలు తవ్వేందుకు అస్ట్రేలియాకు చెందిన కంపెనీకి లీజును ఖరారు చేసింది. బంగారు తవ్వకాల కోసం ఇప్పటికే కంపెనీ ఇప్పటికే పలు పరిశోధనలు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధమై ఉంది. దీనికి తోడు భూమిపొరల్లో వేల అడుగుల లోతులో వజ్రాల నిక్షేపాలు ఉన్నట్లు కూడా ప్రభుత్వం కనుగొంది. అయితే అంత లోతులో ఉన్న నిక్షేపాలు వెలికితీయడం సాధ్యం కాదని ఆ ఆలోచనకు స్వస్తి చెప్పింది.

సుదూర ప్రాంతాల నుంచి

విలువైన వజ్రాల కోసం స్థానిక ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి వజ్రాన్వేషణ చేస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాల్లో అణువణువు గాలిస్తూ వజ్రాల కోసం వెతుకుతుంటారు. వెతికేందుకు వచ్చిన రోజే వజ్రం దొరికితే అమ్ముకుని ఆ డబ్బుతో వారి ప్రాంతాలకు ఆనందంగా వెళ్తారు. ఏళ్ల తరబడి వజ్రాల కోసం వెదుకుతూ తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వచ్చే ఆశావహులు ఇక్కడ కనిపిస్తుంటారు. వచ్చే ఏడాదైనా తమకు వజ్రం దొరకకపోదా తమ కష్టం తీరకపోదా అని నమ్మకంతో నిరాశతో మరికొందరు తిరుగుముఖం పడుతుంటారు.

రెండేళ్లుగా వస్తున్నా...



ఈ ప్రాంతంలో వజ్రాలు దొరుకుతాయని పత్రికల్లో, టీవీల్లో చూసి తెలుసుకున్నా. రెండేళ్లుగా వజ్రాలు వెతికేందుకు ఇక్కడికి వస్తున్నాను. వారం, రెండు వారాలు ఇక్కడే ఉండి వెతికి వెళ్లిపోతున్నా. ఈసారైనా వజ్రం దొరుకుతుందన్న ఆశతో వచ్చాను.

- శ్యాంబాబు, గుంటూరు



వజ్రాన్వేషకులు వచ్చిన వాహనాలు

బస్టాండ్, దేవాలయాల ప్రాంగణాలే ఆవాసాలు

సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు పత్తికొండ ప్రాంతానికి వజ్రాన్వేషణకు వస్తుంటారు. ఒకసారి వచ్చినవారు మూడు, నాలుగు రోజుల పాటు ఇక్కడే ఉంటూ వజ్రాన్వేషణ చేస్తుంటారు. గ్రామీణ ప్రాంతాలు కావడంతో వీరు సమీపంలోని బస్టాండ్లు, దేవాలయ ప్రాంగణాల్లో ఆవాసం ఏర్పరుచుకుంటారు. ఎలాంటి సదుపాయాలు అందుబాటులోలేని ఈ ప్రాంతంలో చలికి, వానకు ఇబ్బందులు పడుతూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంటారు.

కుటుంబమంతా వచ్చాం



ఈ ప్రాంతంలో వజ్రాల గురించి నాకొడుకు తెలుసుకుని పోయినసారి వచ్చాడు. ఈసారి నాకొడుకుతో పాటు నేను మా ఆయన అందరం వచ్చాం. అదృష్టం తగిలి వజ్రం దొరికితే మాపాత ఇంటిని కొత్త ఇంటిగా మార్చుకుంటాం.

- లలితాబాయి, నల్లమాడ మండలం, శ్రీసత్యసాయి జిల్లా

అమ్మాయి పెళ్లి చేశా, ఇల్లు కట్టుకున్నా



మాది ఒంగోలు దగ్గర చిన్నపల్లెటూరు, నాకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కొడుకు. కూలీచేస్తూ వారిని పోషిస్తున్నాను. ఈ ప్రాంతంలో వజ్రాల గురించి టీవీల్లో చూసి పోయిన సారి జూన్‌లో వజ్రాలు వెతికేందుకు వచ్చాను. రెండు వజ్రాలు దొరికాయి. ఒకటి రూ.4.5 లక్షలు, మరొకటి రూ.7 లక్షలకు విక్రయించి ఆ డబ్బుతో ఇంటికి వెళ్లాను. మా కుమార్తె వివాహం చేశాను. పాత ఇంటిని కొత్తగా మార్చుకున్నాను. ఈ ఏడాది మరోసారి దొరికితే మరో కుమార్తె వివాహం చేయాలని వచ్చాను. - దేవయ్య, ఒంగోలు



వజ్రాన్వేషణలో నిమగ్నమై ఉన్న మహిళలు

ఈసారే వచ్చాం



మాది కర్నూలుకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊరు. ఇంటి దగ్గర పరిచయం ఉన్న నలుగురం కలిసి ఈసారే వజ్రాలు వెతికేందుకు వచ్చాం. తినేందుకు ఇంటి దగ్గరి నుంచి రొట్టెలు తెచ్చుకున్నాం. మూడు రోజులు ఇక్కడే ఉండి మా అదృష్టం ఎలాఉందో చూసుకుంటాం.

- లక్ష్మి, కర్నూలు

పది మందితో వచ్చాం



మాది అన్నమయ్య జిల్లా మదనపల్లి దగ్గర చిన్న ఊరు. పది మందితో వజ్రాలు వెతికేందుకు వచ్చాం. వారంపాటు ఇక్కడే ఉంటాం. ఏదో గుడిలో పడుకునేందుకు ఏర్పాటు చేసుకుని అక్కడే తినేందుకు వంట తయారు చేసుకుంటాం. వజ్రం దొరికితే మా పేదరికం పోతుందని, మా పిల్లలకు ఆ డబ్బులు పనికొస్తాయన్న ఆశతో వచ్చాం.

- బేబమ్మ, మదనపల్లి, అన్నమయ్య జిల్లా

జిల్లాలో విస్తారంగా వర్షాలు

రుద్రవరం మండలంలో 47.8 ఎం.ఎం., వర్షపాతం



చాగలమర్రిలో పట్టపై నిలిచిన వర్షపునీరు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల రాకతో మంగళవారం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. రుద్రవరం మండలంలో అత్యధికంగా 47.8ఎంఎం వర్షపాతం నమోదైంది. శిరువెళ్లలో 35.0, గోస్పాడు 33.4, మహానంది 29.2, ప్యాపిలి 25.4, డోన్ 23.4, కోవెలకుంట్ల 23.2, బండిఆత్మకూరు 19.0, ఆళ్లగడ్డ 17.8, దొర్నిపాడు 16.6, నంద్యాల 15.8, కొలిమిగుండ్ల 11.0, ఉయ్యాలవాడ 10.4, నందికొట్కూరు 9.2, చాగలమర్రి 9.2, కొత్తపల్లె 8.0, బేతంచర్ల 7.2, బనగానపల్లె 6.4, వెలుగోడు 5.2, సంజామల 4.2, జూపాడుబంగ్లా 3.8, ఆత్మకూరు 3.8, పాములపాడు 3.8, పగిడ్యాల 3.6, మిడ్తూరు 2.8, పాణ్యం 2.0, అవుకు 1.6, గడివేముల 1.0, శ్రీశైలం 0.4 ఎంఎం వర్షపాతం నమోదైంది.

రైతులకు శాస్త్రవేత్తల సూచనలు

రుతుపవనాలు ముందుగా రావడంతో శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. వర్షాధారంగా సాగుచేసే వేరుశనగ, కంది, ఆముదం, పత్తి సాగు చేసే రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకోవాలని వ్యవసాయ వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌శంకర్‌బాబు, రీసర్చ్ అసోసియేట్ డాక్టర్ ఉమాదేవి సూచిస్తున్నారు. అలాగే వర్షాధార పంటలు వేసుకునేందుకు జూన్, జులై మాసాలు అనుకూలంగా ఉంటాయని, రైతులు ప్రస్తుతం తేమ ఉండటంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావాలని సూచించారు. ఖరీఫ్‌లో వరి సాగుచేసే రైతులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న తేమను వినియోగించుకుని పచ్చిరొట్ట పంటలను సాగు చేసుకోవాలన్నారు. పత్తి, వేరుశనగ పంటలో అధిక దిగుబడినిచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలని, సిఫార్సు మేరకు ఎరువులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. జూన్, జూలైలో కనీసం 60ఎంఎం నుంచి 70ఎంఎం వర్షం కురిసిన తర్వాత విత్తనం నాటుకుంటే భూమిలో వేడి తగ్గి మొలక శాతం అధికంగా ఉంటుందన్నారు. జూలై 15లోపు సామూహికంగా విత్తుకుంటే గులాబీరంగు పురుగు ఉధృతి నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు.



హుండీ లెక్కింపులో పాల్గొన్న శివసేవకులు, ఆలయ సిబ్బంది

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.75 కోట్లు

నంద్యాల కల్చరల్, మే 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలోని హుండీల లెక్కింపు మంగళవారం ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. హుండీలను లెక్కించగా గత 28 రోజులకు గాను రూ.3,74,99,234 వచ్చినట్లు ఈవో తెలిపారు. అలాగే హుండీలో 120.10 గ్రాముల బంగారు, 4.26 కిలోల వెండి లభించాయన్నారు. అదే విధంగా 377 యూఎస్ఏ డాలర్లు, 25 సింగపూర్ డాలర్లు, 10 కెనడా డాలర్లు, 15 ఆస్ట్రేలియా డాలర్లు, 200 యూకే పౌండ్స్, 30 ఈరోస్, 21 కువైట్ దినార్, వెయ్యి వియత్నాం డాంగ్స్, 44 మలేషియా రింగిట్స్, వెయ్యి జపాన్ ఎన్స్, 10 మాల్దీవుల రుఫియాస్ మొదలైన విదేశీ కరెన్సీ కూడా ఈ హుండీలో లభించాయన్నారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రమణమ్మ, పలు విభాగాల అధికారులు, శివసేవకులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టండి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మే 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, ఐహెచ్ఎల్, సోక్‌పిట్స్ కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, చెత్తసంపద తయారీ కేంద్రాలు తదితర అంశాలపై డీఆర్ఈవో, డీఈఈ, ఏఈ, డిప్యూటీ ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, ఎమ్మార్సీలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 24 పర్యాటక కేంద్రాల్లో పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి 15రోజులకోసారి గ్రామాల్లోని ట్యాంకులను పరిశుభ్రం చేసి తేదీని ట్యాంక్‌పై రాయాలని ఆదేశాలు జారీ చేశారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రకు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు ప్రతి నెలా నిర్వహిస్తున్న కార్యక్రమాల ఫొటోలు సేకరించి సచివాలయం, మండల కార్యాలయాల్లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి డీపీవో శివారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య, డీపీఆర్సీ మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏపీ ఈఏపీసెట్

నంద్యాల ఎడ్యుకేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్, ఫార్మసి, ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు ముగిశాయి. చివరిరోజు మంగళవారం జరిగిన పరీక్షకు 577మంది విద్యార్థులకు గాను 540మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా ఈనెల 19వతేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన పరీక్షల్లో అగ్రికల్చర్, ఫార్మసి కోర్సులకు 2849 మంది విద్యార్థులకు గాను 2655 మంది విద్యార్థులు హాజరు కాగా 194 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు 5409 మంది విద్యార్థులకు గాను 5205 మంది విద్యార్థులు హాజరుకాగా 204 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం మీద 8258 మంది పరీక్షలు రాయగా 7860 మంది విద్యార్థులు హాజరై 398 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 95.74శాతం హాజరు నమోదు అయ్యింది.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్

డీఐఈవో సునీత

నంద్యాల ఎడ్యుకేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో బుధవారం నుంచి రెండు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్లు డీఐఈవో సునీత తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మే 28వ వతేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 23 మంది రెగ్యులర్ విద్యార్థులకు, ఆర్ఎస్.రోడ్‌లోని ఎస్పీజీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 233 మంది ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


సత్ప్రవర్తనతో మెలగాలి



కార్యక్రమంలో పాల్గొన్న వెంకటశేషాద్రి

నంద్యాల క్రైం, మే 27 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు జైలు జీవితం తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని ఉమ్మడి కర్నూలు జిల్లా న్యాయసేవా కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి అన్నారు. మంగళవారం నంద్యాలలోని స్పెషల్ సబ్ జైలును ఆయన తనిఖీ చేశారు. 70ఏళ్ల పైబడిన వృద్ధ ఖైదీలకు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు. జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ గురించి వివరించారు. ఖైదీలకు న్యాయసలహాలు అందించేందుకు ఈ విభాగం సిద్ధంగా ఉంటుందన్నారు. 15011 హెల్ప్ లైన్ నెంబర్‌పై ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గురుప్రసాద్‌రెడ్డి, డా. గురుకుమార్, న్యాయవాదులు బాలునాయక్, శేషసాయిబాబా, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.


ప్రకృతి ఒడిలో ఎన్టీఆర్ చిత్రం





ప్రముఖ చిత్రకారుడు కోటేష్ ఎ3 డ్రాయింగ్ చార్ట్ మీద వాటర్ కలర్ పెయింటింగ్స్‌తో ప్రకృతి ఒడిలో దివంగత ఎన్టీఆర్ చిత్రాన్ని అద్భుతంగా వేశారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ తేజోమయ రూపాన్ని వర్ణిస్తూ ప్రకృతిలో ఉన్నట్లు తీర్చిదిద్దారు. ప్రకృతి అంటే నింగి, నేల, కొండలు, కోనలు, ఉదయించే సూర్యుడిని ఎన్టీఆర్ నుదుటి బొట్టుగా అలంకరించారు. ఇందులో అన్నగారికి ఒక ఏనుగు దండం పెడుతున్నట్లు వేశారు. ముఖ్యమంత్రిగా పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు పెట్టిన ప్రజల మనిషి ఎన్టీఆర్. ఆయనపై ఉన్న అభిమానంతో గతంలో ఎన్నో చిత్రాలు వినూత్నంగా వేశారు. ఈసారి ఇలా ప్రకృతి ఒడిలో ఎన్టీఆర్ చిత్రాన్ని వేసినట్లు కోటేష్ తెలిపారు.

- నంద్యాల కల్చరల్ (ఆంధ్రజ్యోతి)



మహానాడు సంబరం

కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.

ఐపీపీబీ ఖాతాల కోసం ప్రత్యేక డ్రైవ్

కర్నూలు న్యూసిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)ఖాతాలను తెరిచేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఏపీపీబీ కొత్తఖాతాలు తెరవడం, ఆధార్ అను సంధానం చేయడానికి ఈనెల 31నుంచి జూన్ 4 వరకు ప్రత్యే క డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఉన్న బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ చేయడం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మ్యాపింగ్‌లను సులభతరం చేయడం ప్రాథమిక లక్ష్యమని వెల్లడించారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న 15,365 ఖాతాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న 434 పోస్టాఫీసుల ద్వారా పునరుద్ధరణ చేసినట్లు వివరించారు. మరిన్ని వివరాల కోసం దగ్గరలోని పోస్టాఫీసులో సంప్రదించాలని కోరారు.

'ఉద్యం' రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పిస్తాం

జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ మే 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యం రిజిస్ట్రేషన్ పోర్టల్‌పై పరి శ్రమల యజమానులకు అవగాహన కల్పిస్తామనిజిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ తెలిపారు. మంగళవారం ఆమె కార్యాలయ గదిలో విలేకరులతో మాట్లాడారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహ పరిశ్రమల యజమానులు తమ పేర్లను తక్షణమే ఉద్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఉద్యం రిజిస్ట్రేషన్ పోర్టల్‌పై బుధవారం తమ కార్యాలయ ప్రాంగణంలో అవసరార్థులకు కార్యశాల నిర్వహిస్తు న్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు ఉద్యం పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకొని యజమానులకు ఉచితంగా నమోదు చేయిస్తామని తెలిపారు. దీంతో భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాలను సులువుగా పొంద వచ్చునని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురి డిబార్

కర్నూలు అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూని వర్సిటీ(ఆర్‌యూ) పరిధిలో జరిగిన 2, 6 సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 2వ సెమిస్టర్‌కు 10, 110 మందికి 9,02 మంది, 6వ సెమిస్టర్‌కు 175 మంది దరఖాస్తు చేసుకోగా 155 మంది హాజరై పరీక్షలు రాశారని పేర్కొన్నారు. శ్రీశంకరాస్ డిగ్రీ కళాశాల, కర్నూలు-1, సాధన డిగ్రీ కళాశాల, నంద్యాల-1, ఎస్టీ జోసెఫ్స్ కాలేజీ ఫర్ ఉమెన్స్, కర్నూలు-1 విద్యార్థులు పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడటంతో డిబార్ చేశామని తెలిపారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

- బదిలీల కోసం 134 మంది దరఖాస్తు
- ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు 57 మంది
- జూన్ 2 నాటికి బదిలీ ప్రక్రియ పూర్తి

కర్నూలు న్యూసిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో వివిధ శాఖల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులకు సంబంధించి బదిలీల దరఖాస్తుల స్వీకరణకు మంగళ వారం గడువు ముగిసింది. ఈమేరకు ఎంపీడీవో, పరిపాలన అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టు, రికార్డు, లైబ్రరీ, ల్యాబ్ అసిస్టెంట్లు, నాల్గవ తరగతి ఉద్యోగులు, స్వీపర్, వాచ్‌మెన్‌లు మొత్తంగా 134 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఐదేళ్లు పూర్తి చేసిన వారు 57, ఐదు సంవత్సరాలు లోపు ఉన్నవారు 77 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రధానంగా ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారికి ప్రాధాన్యత క్రమంలో బదిలీలు చేపట్టేవిధంగా ప్రభుత్వం నిబంధనలు జారీచేసింది. ఈ మేరకు అధికారులు ఈ క్రమంలో కసరత్తు ప్రారంభించారు. జూన్ 2 నాటికి బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

పోలీసులే అంత్యక్రియలు చేయడం అమానుషం

- ప్రజా సంఘాల నాయకులు
- మావోయిస్టుల ఎన్‌కౌంటర్ దుర్మార్గమైన చర్య
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ
- నంబాల కుటుంబ సభ్యులను బెదిరించిన మంత్రి, ఎస్పీ
- విరసం నాయకుడు పాణి

కర్నూలు న్యూసిటీ, మే27(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో భద్రతాదళాల కాల్పుల్లో చంపబడ్డ మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు ఇవ్వకుండా పోలీసులే అంత్యక్రియలు చేయడం అమానుషమని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో పోలీసుల తీరు ను వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎం,పీఓపీ, విరసం, ఎస్‌డీపీఐ, న్యూడెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్), ఆర్‌పీవీ, కేఎన్‌పీఎస్ ఇతర ప్రజాసంఘాల అధ్వర్యంలో సీపీఐ కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల కుటుంబ సభ్యులు ఐదు రోజులుగా నారాయణపూర్‌లోని జిల్లా ఆసుపత్రి వద్ద పడిగాపులు కాచినా వాళ్లకు మృతదేహాలను ఇవ్వ కుండా పోలీసులే దహనం చేయడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అన్నారు.

ప్రజాభ్యుదయ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఈ దేశ పౌరులైన మావోయిస్టులతో చర్యలు జరపకుండా ఇలా ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ మొత్తం ఘటనపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిచేత విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ శవాలకు కూడా హక్కులు ఉంటాయని, మృతులు ఏరంగానికి చెందినవారైనా వారి మృతదేహాలకు అంత్యక్రియలు, అంతిమ సంస్కారాలు నిర్వహించుకునే హక్కు కుటుంబసభ్యులకు ఉంటుందన్నారు. మృతుల శరీరాలు ఆంధ్రప్రదేశ్‌కు ఎట్టి పరిస్థితుల్లో రాకూడ దని మంత్రి అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వర రెడ్డి మావోయిస్టు నంబాల కేశరావు కుటుంబసభ్యులను బెదిరించారని అన్నారు. పౌరహక్కుల సంఘం నాయకుడు అల్లాబకష్ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగానే మావోయిస్టు నాయకుల మృత దేహాలు కుటుంబం వారికి అందకుండా చేసిందని పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం కోర్టును కూడా ధిక్కరించి శవాలను దహనం చేసిందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు వెంకటస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు భాస్కర్, సీపీఐ సీనియర్ నాయకుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, రాయలసీమ విద్యావంతుల ఐక్యవేదిక నాయకుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎస్‌డీపీఐ చాంద్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామక్రిష్ణ

గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎంపిక గ్రామాల్లో మౌలిక సదుపాయాలు
- జూన్ 15 నుంచి అమలు
- కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి అమలు చేస్తున్న 'దర్తీ ఆభా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్' సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ భాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఈఅభియాన్ అమలుపై సంబంధిత శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 500 లేదా అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన కనీసం 50 శాతం గిరిజన నివాసితులు కలిగిన జిల్లాలోని గ్రామాల్లో దర్తీ ఆభా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, సామాజిక- ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుస్తారని తెలిపారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి తులసిదేవి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి, డీఈవో శామ్యూల్ పాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఎల్‌డీఎం రామచంద్రరావు, డీఎంహెచ్‌వో శాంతికళ, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డీఎస్‌వో రఘువీర్, డీఎం సివిల్ సప్లయిస్ నాగసుధ పాల్గొన్నారు.



ఏడు గ్రామాల ఎంపిక

జిల్లాలో ఏడు గ్రామాలను ఈ పథకం కింద ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మంత్రాలయం మండలంలోని పరమాన్‌దొడ్డి, నెరవణికి, హొళగుంద మండలంలోని కోగిలితోట, హొళగుంద, మద్దికెర మండలంలోని పెరవలి, మద్దికెర (తూర్పు), హంప గ్రామాల్లో ఈపథకం అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ గ్రామాల్లో పక్కా గృహాలు, రోడ్లు, జల్‌జీవన్ మిషన్ ద్వారా నీటి సరఫరా, మొబైల్ మెడికల్ యూనిట్లు, ఆయుష్మాన్ కార్డులు, అంగన్‌వాడీ సెంటర్లు ఏర్పాట్లు, ఎల్‌పీజీ కనెక్షన్లు, వ్యవసాయ విద్యుద్దీకరణ, హాస్టళ్ల ఏర్పాటు, ఆయుష్మాన్ శాఖ ద్వారా పోషణ వాటికలు తదితర పథకాలను అమలు చేయాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

17 శాఖల ద్వారా..

జూన్ 15 నుంచి ఈ పథకాన్ని అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని, 17 శాఖల ద్వారా ఈ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులపై క్రమంతప్పకుండా సమీక్షలు నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఎప్పుడు కూలుతుందో?

- పొంచి ఉన్న ప్రమాదం
- శిథిలావస్థలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- బిక్కుబిక్కుమంటూ ఉద్యోగుల విధులు
- వర్షం వస్తే తడుస్తున్న సామగ్రి, రికార్డులు



కూలడానికి సిద్ధంగా ఉన్న బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బనగానపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనం నేడో.. రేపో అన్నట్లు కూలడానికి సిద్ధంగా ఉంది. శిథిలావస్థకు సబ్ కార్యాలయం చేరుకుంది. దీంతో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. 100ఏళ్ల క్రితం నవాబుల కాలంలో ఈభవాన్ని నిర్మించారు. భవనం ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా, పై భాగంలో ఉన్న కప్పు కూడా పూర్తిగా దెబ్బతినింది. వర్షం కురిస్తే చాలు కార్యాలయంలోని కంప్యూటర్లు, రికార్డులు తడిచిపోయి పనులు నిలిచిపోతున్నాయి. దీంతో ఎవరైనా పాత నకిలీ రిజిస్ట్రార్ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే నెలల తరబడి ఆలస్యం అవుతోంది.

కరువైన కనీస సౌకర్యాలు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కార్యాలయానికి ప్రహరీ లేదు. అలాగే రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు బనగానపల్లె, సంజామల మండలాల నుంచి నిత్యం వందలాది మంది రైతులు, ప్రజలు వస్తుంటారు. కనీసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వారు కూర్చోడానికి కూడా స్థలం లేదు. తాగునీటి వసతి కూడా లేదు. దీంతో ప్రజలు నీటి కోసం హోటళ్లను ఆశ్రయిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపినా..

గతంలో అనేకసార్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవన నిర్మాణం కోసం జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. బడ్జెట్ మాత్రం రాలేదు. వేసవి కాలంలో రైతులు, ప్రజలు కార్యాలయానికి రావాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజలకు కూర్చోడానికి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే యుద్ధప్రాతిపదికన నిధులు విడుదల చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి నూతన భవనాన్ని నిర్మించాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.

రేషన్ సక్రమంగా అందించాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కర్నూలు నగరంలోని చాణిక్యపురి కాలనీలో ఉన్న పౌర సరఫరాల మండల స్థాయి స్టాక్ పాయింట్లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎఫ్‌పీ షాపులకు సరఫరా చేసే రేషన్ సరుకుల నాణ్యతను, తూకాలు వేసే యంత్రాలను పరిశీలించారు. స్టాక్ పాయింట్స్‌లో ఏయే వస్తువులు ఎంత స్టాక్ ఉన్నాయని రిజిస్టర్లను పరిశీలించారు. తూకాల్లో తేడాలు ఉండకూడదని, ప్రజలకు రేషన్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల డీఎం నాగసుధ, డీఎస్‌వో రాజా రఘువీర్, కార్పొరేషన్ అసిస్టెంట్ మేనేజర్ పరిమళ పాల్గొన్నారు.

మహానాడులో తెలుగు తమ్ముళ్లు





నంద్యాల కౌంటర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

కర్నూలు, మే 27 (ఆంధ్రజ్యోతి): కడప వేదికగా మంగళవారం ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ శ్రేణుల మూడు రోజుల పండుగ మహానాడుకు ఉమ్మడి కర్నూలు నుంచి టీడీపీ శ్రేణులు వేలాదిగా తరలివెళ్లాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు సహా 14 అసెంబ్లీ నియోజకర్గాల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు తరలివెళ్లారు. మహానాడులో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, గౌరు చరితారెడ్డి, కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, గిత్తా జయసూర్య, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, ఆదోని, ఆలూరు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జిలు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, వీరభద్రగౌడ్, మాధవరం రాఘవేంద్రరెడ్డి, కేడీసీసీబీ చైర్మన్‌గా ఎంపికైన ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ కటౌట్ల వద్ద టీడీపీ కార్యకర్తలు ఫొటోలు దిగారు.



మహానాడులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, పార్టీ నాయకులు వీరభద్రగౌడ్, ధర్మవరం సుబ్బారెడ్డి, భూమా బ్రహ్మానందరెడ్డి



మహానాడులో జిల్లా మంత్రి టీజీ భరత్, ఆదోని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, ఉమాపతి నాయుడు తదితరులు





హోంశాఖ మంత్రి అనితతో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్.. నారా లోకేశ్‌తో సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మహానాడు వేదికపై మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, నాయకులు దేవేంద్రప్ప, రాఘవేంద్రరెడ్డి

వేరుశనగ సబ్సిడీ 40 శాతం

• ఏపీ సీడ్స్ మేనేజర్ ధనలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ రైతులకు వేరుశనగ విత్తన కాయల ధరలతో పాటు 40 శాతం సబ్సిడీని ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏపీ సీడ్స్ మేనేజర్ ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ సబ్సిడీ ఏ రకం విత్తనం వివరాలు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 11,118 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. కే-6 రకం క్వింటం పూర్తి ధర రూ.9,300 కాగా, ప్రభుత్వ రాయితీ 3,720 పోను రైతు వాటా రూ.5,580 చెల్లించాలని ఈ లెక్కన 30 కిలోల బస్తాకు రూ.1,674 ధర ఉంటుందని స్పష్టం చేశారు. అదే విధంగా రాయితీ పోను నారాయణి రకం వేరుశనగ విత్తనం 30 కిలోల బ్యాగ్‌కు రూ.1,710, లేపాక్షి రకం 30 కిలోల ధర రూ.1,476గా ఖరారు చేశామన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా వీలైనంత త్వరగా పంపిణీ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సబ్ జైలును తనిఖీ చేసిన న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి



మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి

ఆళ్లగడ్డ మే 27(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని సబ్ జైలును మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకటశేషాద్రి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని అన్నారు. న్యాయవా దులను నియమించుకోలేని నిరుపేద ఖైదీలకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం సబ్ జైలు రికార్డులను, ఖైదీలకు ఇచ్చే ఆహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ లార్డ్ వర్డ్ వర్స్ మోహన్, మెడికల్ అధికారి నాగమస్తాన్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు

చాగలమర్రి, మే 27 (ఆంధ్రజ్యోతి): 40వ జాతీయ రహదారిలో విద్యుత్ స్తంభాలు తీసుకెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి ప్రమాద వశాత్తు బోల్తాపడింది. శ్యామ్‌సన్, విష్ణు అనే రైతులు చాగలమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి నేలంపాడు గ్రామానికి విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా నగల్లపాడు సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న రైతులు శ్యామ్‌సన్, విష్ణు గాయ పడ్డారు. వారిని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్రేన్ సాయంతో బోల్తాపడిన ట్రాక్టర్‌ను తొలగించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తాపడ్డ ట్రాక్టర్

మహిళ ఆత్మహత్య

బండిఆత్మకూరు, మే27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంత జూటూరు గ్రామంలో బేబి(42) అనే మహిళ మంగళవారం విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. బేబీ 7 సంవత్సరాల నుంచి షుగర్ వ్యాధితో బాధపడుతూ, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యా యత్నం చేసినట్లు తెలుస్తోంది. మృతురాలి కుమారుడు విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక..

తుగ్గలి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడింది. జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రామచంద్ర భార్య రుక్మిణి(47) కడుపు నొప్పి తాళలేక సోమవారం విష ద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు గుత్తి వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తమ్ముడు జయరాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కృష్ణవేణి, రామచంద్రకు 25 ఏళ్ల క్రితం వివాహం కాగా సంతానం కలగలేదు.

వైద్య పరికరాల కొనుగోలుపై సమావేశం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, మే 27(ఆంధ్రజ్యోతి): జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైద్య పరికరాల కొనుగోలుపై మంగళవారం సమావేశం జరిగింది. ఇందులో ఏఎంసీలో ఆక్సిజన్ ప్యానెల్, రెండు హీమో డయాలసిస్ మిషన్లు, హారిజంటల్ ఆటో క్లియర్ ఎయిర్ కంప్రెసర్ పరికరాలను కొనుగోలుకు కమిటీ ఆమోదం తెలిపినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. కొత్త పరికరాలతో రోగులకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, ఎండోక్రైనాలజీ, ఆర్థో, అనస్థీషియా విభాగాల హెచ్‌వోడీలు డాక్టర్ పి.శ్రీనివాసులు, కె.శ్రీనివాస్, విశాల మెడిసిన్ ప్రొఫెసర్ లక్ష్మీబాయి, సీఎస్ఆర్ఎంవో బి.వెంకటేశ్వర్లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధూ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉత్కంఠగా పీఆర్ ఉద్యోగుల కౌన్సెలింగ్

నంద్యాల, మే 27(ఆంధ్రజ్యోతి): రాయలసీమ పరిధిలోని పంచాయతీ రాజ్‌శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ ఉత్కంఠగా సాగింది. మంగళవారం అనంతపురం జిల్లా కేంద్రంలోని పంచాయతీ రాజ్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ శాఖ ఈఎన్‌సీ బాలునాయక్‌తో పాటు రాయలసీమ పరిధిలోని (జోన్-4)కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప ఉమ్మడి జిల్లాల ఎస్ఈలు, ఈఈల ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయం త్రం వరకు కౌన్సెలింగ్ ఉత్కంఠగా సాగింది. ముందుగా ఆయా జిల్లాల పరిధిలో ఐదేళ్లు పూర్తయిన డీఈఈలు, ఏఈలు, ఏఈఈలతో పాటు తదితర విభాగాల ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు పీఆర్ఐ డివిజన్ డీఈఈగా పనిచేస్తున్న ధనిబాబును కర్నూలు క్వాసీ-1 డీఈఈగా బదిలీ చేశారు. ఇక్కడ క్వాసీ-1 డీఈఈగా పనిచేస్తున్న హెచ్‌డీ వీరన్నను నందికొట్కూరు పీఐయూకు బదిలీ చేశారు. నంద్యాల క్వాసీ విభాగం డీఈఈగా పనిచేస్తున్న కేఎస్ఆర్ మోహన్‌రావు నంద్యాల పీఐయూకు బదిలీ చేశారు. అదేవిధంగా రిక్వెస్ట్ బదిలీ కింద నంద్యాల డీపీఆర్ఈపీ పీఏగా పనిచేస్తున్న డీఈఈ సుధాకర్‌రెడ్డిని క్వాసీ విభాగం నంద్యాలకు, కర్నూలు ఎస్ఈ పీఏగా పనిచేస్తున్న డీఈఈ సుధాకర్‌బాబును నంద్యాల పీఆర్ఐకు బదిలీ చేశారు. అనంతపురం

• కొందరికి బదిలీ.. మరికొందరికి యథాస్థానం

జిల్లాలో ఐదేళ్లు పూర్తయిన నలుగురు డీఈఈలు ఉండగా.. వీరిలో త్వరలో పదవీ విరమణ ఉండటంతో అనంతపురం పీఐయూ డీఈఈగా పనిచేస్తున్న భరత్‌ప్రకాష్‌రెడ్డి, అనంతపురం క్వాసీ డీఈఈ రవీంద్రను యథాస్థానాల్లో ఉంచారు. అదేవిధంగా గుత్తి డీఈఈగా పనిచేస్తున్న డీఎల్ మురళీతో పాటు శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి పీఐయూ డీఈఈగా పనిచేస్తున్న మధుప్రకాష్ రెడ్డి ఆ శాఖ ఉద్యోగుల యూని యన్‌లో ఉండటంతో యథాస్థానాల్లో ఉంచారు. కడప జిల్లాలోని ఎస్ఈ పీఏగా పనిచేస్తున్న డీఈఈ రాముడిని జమ్మలమడుగు క్వాసీ డివిజన్‌కు బదిలీ చేశారు.

కర్నూలు జిల్లాలో ఐదేళ్లు పూర్తయిన ఏఈలు ఏడుగురు ఉండగా.. వీరిలో ఒకరిని మాత్రమే బదిలీ చేసి మిగిలిన వారిని యథాస్థానాల్లో ఉంచారు. అనంతపురం జిల్లాలో ఏడుగురు ఏఈలు ఉండగా. ముగ్గురు ఏఈలను బదిలీ చేసి.. మిగిలిన నలుగురు ఏఈలను యథాస్థానాల్లో ఉంచారు. కడప జిల్లాలో ఆరుగురు ఏఈలు ఉండగా.. ఇద్దరు ఏఈలను బదిలీ చేసి మిగిలిన నలుగురిని అక్కడే పోస్టింగ్ కల్పించారు. రిక్వెస్ట్ బదిలీ కింద కర్నూలు జిల్లాలో ఇద్దరు, అనంతపురంలో ఆరుగురు, కడపలో ఆరుగురు, చిత్తూరులో ఒకరు ఏఈల చొప్పున బదిలీ చేశారు.



అనంతపురం పీఆర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పంచాయితీరాజ్ ఈఎన్‌సీ బాలు నాయక్

ఇద్దరు సూపరింటెండెంట్ల బదిలీ

అనంతపురం పీఆర్ ఎస్ఈ ఆఫీస్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గీతమ్మను నంద్యాలకు, ఇక్కడ పనిచేస్తున్న సూపరింటెండెంట్ రమాదేవిని అనంతపురానికి బదిలీ చేశారు. అదేవిధంగా టీవో(టెక్నికల్ ఆఫీసర్స్) అనంతపురం పీఆర్ఐ డివిజన్‌లో టీవోగా పనిచేస్తున్న భానుప్రకాష్‌ను నంద్యాలకు బదిలీ చేయగా.. చిత్తూరులో టీవోగా పనిచేస్తున్న అరుంధతిని అనంతపురానికి బదిలీ చేశారు.

కడసారి చూపునకు నోచుకోలేకపోయాం

• మావోయిస్టు లలిత కుటుంబ సభ్యుల ఆవేదన



కన్నీరుమున్నీరవుతున్న లలిత తల్లిదండ్రులు, బంధువులు

ఆస్పరి, మే27(ఆంధ్రజ్యోతి): ఎప్పుడో 22 ఏళ్ల క్రితం తమ కుమార్తె లలిత మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లిందని, తామంతా మిస్సింగ్ అయ్యిందని, ఎక్కడో ఓ చోట ఉండి ఉంటుందని అనుకున్నామని ములుగుందం గ్రామానికి చెందిన ఆమె తల్లిదండ్రులు ఎస్తేరమ్మ, గోనెగండ్ల దుబ్బన్న, తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 22న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని నారాయణపూర్ అడవుల్లో మావోయిస్టు లలిత అలియాస్ సంగీత పోలీసు కాల్పుల్లో మృతిచెందిందన్న సమాచారం కుటుంబసభ్యులకు తెలిసింది. నిరుపేదలమైన తాము లలితను ఎంతో ఆశతో చదివించామని, 22 యేళ్ల క్రితం ఏదో ఉద్యోగం చేసుకుంటానని వెళ్లిన కూతురు ఇక తిరిగి రాలేదని అన్నారు. విప్లవోద్యమంలో పని చేస్తూ చివరికి ఇలా మృత్యుఒడి చేరుకుంటుందని అనుకోలేదని ఆవేదన చెందారు. పోలీసులు మానవత్వంతో మృతదేహాన్ని అయినా ఇస్తారని తమ కొడుకులు వెళ్లారని, అయినా వారు దుర్మార్గంగా వ్యవహరించారని లలిత తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

మా అమ్మ కోలుకోవడం కష్టం



మా నలుగురు తమ్ముళ్లకు ఊహ తెలియని వయసులోనే మా అక్క లలిత కుటుంబాన్ని విడిచి వెళ్లింది. ఎక్కడో ఓ చోట ఉంటుందని మా అమ్మ, నాన్నలు చెబుతూ వచ్చారు. ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిందన్న సమాచారం తెలియడంతో దిగ్భ్రాంతికి గురయ్యాం. మా అమ్మ అప్పటి నుంచి మంచం పట్టింది. మా అక్క మృతితో మా అమ్మ కోలుకోవడం కష్టంగా మారింది. కనీసం మృతదేహాన్ని అయినా చూసి దుఃఖాన్ని దిగమింగుకు న్నామన్న ఆశ కూడా లేకపోయింది. **- ఎర్రప్ప, లలిత తమ్ముడు, ములుగుందం గ్రామం**

తైక్వాండో చాంపియన్‌గా కర్నూలు



తైక్వాండో విజేత కర్నూలు జట్టుతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో కర్నూలు జిల్లా క్రీడాకారులు మొదటి స్థానంలో నిలిచి బంగారు, రజిత, కాంస్య పతకాలను సాధిం చారు. రెండో స్థానంలో నంద్యాల, మూడో స్థానంలో ఎమ్మిగనూరు క్రీడాకారులు నిలిచారు. కార్యక్రమానికి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సీఈవో విజయకుమార్, కార్యదర్శి శ్రీనివా సులు, జిల్లా తైక్వాండో సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి సతీష్ కుమార్, నంద్యాల ఇన్‌చార్జి అబ్దుల్ మజీద్, పోటీల పర్యవేక్షకులు సాయిబాబా, నయూబ్ రసూల్‌లు పాల్గొని విజేతలకు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు వీరేష్‌బాబు, శివన్న, పరమేష్, ధర్మేంద్ర పాల్గొన్నారు.

సమ్మెకు వ్యవసాయ, కార్మిక సంఘాల మద్దతు

న్యూఢిల్లీ, మే 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోని గ్రామీణ పేదలు, రైతులు, దళిత, ఆదివాసీ, మహిళా సమస్యల పరిష్కారం తదితర ప్రధాన డిమాండ్లతో జూలై 9న జాతీయ ట్రేడ్ యునియన్లు నిర్వహించే సాధారణ సమ్మెకు అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలోని ఏఐఏఆర్ఎల్ఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. పంట లకు మద్దతు ధర, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పని, కనీస వేతనం రూ.600, ఆహార భద్రత కింద ప్రతి ఒక్కరికీ 10 కిలోల బియ్యం, నిత్యావసరాలు కల్పించాలని, తొలగించిన రేషన్ కార్డులను పునరుద్ధరించాలని, విద్యుత్ ప్రైవేటీకరణ విరమించుకోవాలని, దళిత, ఆదివాసీ, మహిళల హక్కు లను పరిరక్షించాలనే డిమాండ్ల సాధనలో తమ వంతు పాత్ర పోషిస్తామని ఆయా సంఘాల నేతలు ప్రకటించారు.

ఎమర్జెన్సీ మెడిసిన్ ఎంతో కీలకం

• సూపరింటెండెంట్ కె. వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఎంతో కీలకమైందని ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఉదయం క్యాజువాల్టీలో ఎమర్జెన్సి మెడిసిన్ డే సందర్భంగా సూపరింటెండెంట్ కేక్ కట్ చేశారు. క్యాజువాల్టీకి వచ్చే రోగులకు ప్రతిరోజు 24 గంటలు వైద్యులు సేవలు చేస్తు ఎంతో మంది ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు రోగులకు తక్షణ వైద్య సాయం అందించడానికి వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అనస్థీషియా సీని యర్ ప్రొఫెసర్లు డాక్టర్ రామశివ నాయక్, సుధీర్, సర్జరీ సీనియర్ ప్రొఫెసర్ రామకృష్ణ నాయక్, ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, క్యాజువాల్టీ సీఎంవో ఫయాజ్ పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న వైద్యులు


మహానాడులో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నాయకులు


మహానాడులో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర నాయకుడు అబ్దుల్ వహీద్


ఆత్మకూరు నుంచి కడప మహానాడుకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు


కడపలో పార్టీ కిట్టును అందుకుంటున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

మహానాడుకు తరలివెళ్లిన నాయకులు

కడప జిల్లాలో మూడు రోజుల పాటు జరిగే మహానాడుకు మంగళవారం జిల్లా ఎమ్మెల్యేలు గౌరు చరిత, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, గిత్తా జయసూర్య, నాయకులు తరలివెళ్లారు. అక్కడ జరిగిన సమావేశాలకు హాజరయ్యారు. గురువారం భారీ సంఖ్యలో తరలివెళ్లనున్నారు.


పాములపాడు నుంచి మహానాడుకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు


మహానాడులో పాల్గొన్న బండి ఆత్మకూరు నాయకులు


నంద్యాల నుంచి బయల్దేరుతున్న మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి


యోగాలో పాల్గొన్న కమిషనర్, అధికారులు

నందికొట్కూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఎన్నో ప్రయోజాలున్నాయని, మనిషి జీవితంలో యోగా ఒక భాగం కావాలని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాలులో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ, మున్సిపల్, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి యోగా గురువులు ఆసనాలు వేయించారు.

మిడుతూరు: మిడుతూరు గ్రామంలోని మోడల్ స్కూల్‌లో మండల స్థాయి అధికారులకు యోగా గురువులు వెంకటేశ్వరి, చంద్రమోహన్, శరత్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి జాకీర్‌హుసేన్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో దశరథరామయ్య, ఎంఈవో శ్రీనాథ్ హాజరయ్యారు. కార్యక్రమంలో పరిపాల అధికారి సురేష్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రేణుక, కార్యదర్శులు పాల్గొన్నారు.

జూన్ 1న డీఎస్సీ మోడల్ టెస్ట్

నంద్యాల ఎడ్యుకేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన డీఎస్సీ మోడల్‌టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పీఆర్‌టీయూ నాయకులు తెలిపారు. పీఆర్‌టీయూ నాయకులు రామఫక్కీరెడ్డి, సయ్యద్‌చాంద్‌బాషా, భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ-25లో భాగంగా ఉపాధ్యాయ కోసం పోటీపడుతున్న అభ్యర్థుల కోసం డీఎస్సీ మోడల్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈటెస్ట్‌ను నంద్యాల పట్టణంలోని చామకాల్వ సెంటర్ సమీపంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్‌మీడియం పాఠశాల, ఆత్మకూరు తోటగేరిలోని పద్మావతి హైస్కూల్, ఆళ్లగడ్డలోని అనంత డిగ్రీ కళాశాల, బనగానపల్లెలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు.

తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు



తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు

ఆత్మకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): కర్నూలులో నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఆత్మకూరు క్రీడాకారులు సత్తా చాటినట్లు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా మంగళవారం తెలిపారు. 58 కేజీల కేటగిరి విభాగంలో పీ.పవన్, 55కేజీల కేటగిరిలో అబ్దుల్ రహిమాన్, 45 కేజీల కేటగిరిలో పీ.కార్తీక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు చెప్పారు. అదేవిధంగా 41కేజీల కేటగిరిలో మహ్మద్ సుగర్ అనే క్రీడాకారుడు సిల్వర్ మెడల్‌ను దక్కించుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు ఈ నెల 9,10,11 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను తైక్వాండో అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఖాజాహుసేన్, సామన్న అభినందించారు.

ఇంటి పన్నుల పెంపు సర్వేను నిలిపివేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంటి పన్నుల పెంపు సర్వేను వెంటనే నిలిపివేయాలని సీపీఎం నాయకులు రణధీర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి 15శాతం పెంచాలని నిర్ణయించిన పన్నుల భారాన్ని రద్దు చేయాలని అన్నారు. అలాగే అనధికార నిర్మాణాల పేరిట 25శాతం నుంచి 100 వరకు జరిమాన విధించే ఆలోచనలను విరమించుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ప్రజలపై రూ.15485కోట్ల విద్యుత్ భారాలు వేయడం జరిగిందని, తిరిగి మున్సిపాలిటీ పన్నుల పేరిట రూ.1500 కోట్ల భారాన్ని మోపాలని నిర్ణయించడం సరికాదని అన్నారు. మహానాడ సదస్సులో పన్నుల పెంచమని తీర్మానం చేయాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం దిగి రాకపోతే ప్రజా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు రామ్‌నాయక్, సద్దామ్‌హుసేన్, షేక్ ఇస్మాయిల్, సురేంద్ర, నాగేశ్వరరావు, వీరన్న, భాస్కర్, జబివుల్లా ఉన్నారు.

సర్వీసు రోడ్డును నిర్మించాలి


పాములపాడు గ్రామ శివార్లలో నిర్మిస్తున్న నేషనల్ హైవే బ్రిడ్జిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి

పాములపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): పాములపాడు గ్రామ శివార్లలో చెలిమిళ్ల వెళ్లే రహదారిలో నేషనల్ హైవే పనుల్లో భాగంగా నిర్మిస్తున్న అండర్‌పాస్ బ్రిడ్జి ఎత్తు పెంచాలని, రోడ్డుకు ఇరువైపుల సర్వీసు రోడ్డు ఏర్పాటుచేయాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన అండర్ బ్రిడ్జిని సందర్శించి మాట్లాడారు. కొత్తపల్లి, మండలంలో పవిత్ర పుణ్య క్షేత్రాలు సంగమేశ్వరం, కొలనుభారతి సరస్వతీ దేవీ క్షేత్రాలకు నిత్యం జిల్లా నలమూలల నుంచి వందల వాహనాలలో దర్శనాలకు భక్తులు తరలి వస్తుంటారని అన్నారు. పొలాలకు వెళ్లే రైతులు, పంటకోత మిష న్లు వెళ్లాలన్న, అలాగే కొత్తపల్లి, పాములపాడు మండలాలకు చెందిన 40 గ్రామాల ప్రజలు సర్వీసు రోడ్డు నిర్మించకుంటే తీవ్ర ఇబ్బందులు పడుతారన్నారు. నేషనల్ హైవే అధికారులు స్పందించి సర్వీసురోడ్డు నిర్మించాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ సుభద్రమ్మకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు కోట్ల నాగేశ్వరరెడ్డి, టీఎన్ఆర్ నాగరాజు, చెలిమిల్ల, లింగాల సర్పంచులు చంద్రారెడ్డి, మల్లీశ్వరరెడ్డి, సిపిఎం నాయకులు సామన్న, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంతో రైతుల ఆర్థికాభివృద్ధి

- జిల్లా ఉద్యానవన అధికారి నాగరాజు


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన అధికారి యు.నాగరాజు

ఆత్మకూరురూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): రైతులు పండ్ల తోటల పంపెకంతో, ప్రభుత్వం అందిస్తున్న చేయూతను అందిపుచ్చుకొని ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి యు.నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కరివేన గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఉద్యానవన అధికారి చందన ఆధ్వర్యంలో రైతు సేవా సిబ్బంది, రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వం అందిస్తున్న ఉద్యానవన పథకాల గురించి వివరించారు. పండ్ల తోటల పెంపకానికి ముందుకు వచ్చే రైతాంగానికి ప్రభుత్వం 100 శాతం రాయితీతో మామిడి, నిమ్మ, సపోట, జామ, సీతాఫలం, నేరేడు, టేకు మొక్కలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మొక్కలు ఏపుగా పెరిగిన తర్వాత పండ్ల తోటల మధ్యలో అంతర పంటలు కూడా సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. భూసార పరీక్షల ద్వారా సాగుకి ఉపయోగంగా ఉన్న నేలను గుర్తించి వాటిలో ఉద్యానవన పంటలు రైతులు సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. మండలంలోని రైతులు పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు వైద్యుల సలహాలు పాటించాలి

● లింగ నిర్ధారణ చేస్తే వైద్యుల పట్టా రద్దు: డీఎంఅండ్‌హెచ్‌వో


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ

నంద్యాల హస్పిటల్, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహాలు పాటిస్తూ ఉచిత వైద్యం పొందాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ తెలిపారు. మంగళవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భిణులు అర్హులైన వైద్యులను సంప్రదించాలని, నాటు వైద్యులు, ఆర్ఎంపీలను ఆశ్రయించవద్దని సూచించారు. ఆర్ఎంపీలు గర్భిణులను అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లకు రెఫర్ చేయవద్దని తెలిపారు. 9నెలల గర్భిణి కాలంలో రెండుసార్లు స్కానింగ్ చేయించుకోవడంతో బిడ్డ పెరుగుదల గురించి తెలుసుకోవచ్చన్నారు. జన్యుపరమైన వ్యాధులు, అంగవైకల్యం నిర్ధారించుకునేందుకు వైద్యులను సంప్రదించి సలహాలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పరిధిలో 21, ప్రైవేట్ పరిధిలో 106స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు లింగనిర్ధారణ వ్యతిరేక చట్టం సెక్షన్ 22ప్రకారం ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలకు సంబంధించి స్కానింగ్‌కు ముందుగాని, తర్వాతగాని లింగనిర్ధారణ గురించి ప్రకటనలు ఇస్తే చట్టప్రకారం ఆ స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జూన్ 2న ఇంటి స్థలాల కోసం ధర్నా


మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): జూన్ 2న ఇంటి స్థలాలపై నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షతన ఇంటి స్థలాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధర్నాకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, మహిళా సంఘ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, రైతు సంఘ జిల్లా కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి, శ్రీనివాసులు, డి, శ్రీనావాసులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నంద్యాల టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చామ కాల్వ వద్ద మద్యం తాగి గుర్తుతెలియని వ్యక్తి (48) మంగళవారం మృతిచెందాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో మృతదేహన్ని పోర్టు మార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చనిపోయిన వ్యక్తి ఘట్టాలనగర్‌కు చెందిన వ్యక్తి అని స్థానికులు చెబుతున్నారు. ఎవరైనా తెలిసిన వారు ఉంటే వివరాలకు ప్రభుత్వ ఆసుపత్రి ఔట్‌పోస్టులో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

విద్యుత్ కనెక్షన్ల కోసం ఆఫీసు చుట్టూ తిరగవద్దు

నంద్యాల కల్చరల్, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం ఆఫీసు చుట్టూ తిరగవద్దని నంద్యాల ఈఈ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. నంద్యాలలో మంగళవారం విద్యుత్ కార్యాలయంలో ఈఈ మాట్లాడుతూ ఇప్పటి వరకు నంద్యాల డివిజన్‌లో 27.5.25 తేదీ వరకు రైతుల కనెక్షన్ల కోసం 2021 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వచ్చేనెల ఆఖరికి మొత్తం 1631 మంది రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని, మిగిలిన 390 మంది రైతులకు సంబంధించి 163డిటిఆర్‌లు, 58కిలోమీటర్ల కండక్టర్లు, 38 కిమీ కే బుల్‌ను కూడా స్టోర్ నుంచి తీసుకున్నామని, వీటికి సంబంధించిన పనులు కూడా జరుగుతున్నాయన్నారు.

మానసిక వికలాంగుల సంక్షేమానికి న్యాయ సలహాలు


మానసిక ఆరోగ్య విభాగాన్ని తనిఖీ చేస్తున్న న్యాయాధికారి వెంకటశేషాద్రి

నంద్యాల క్రైం, మే 27 (ఆంధ్రజ్యోతి): మానసిక వికలాంగుల సంక్షేమం కోసం వారికి న్యాయసలహాలు, సహాయ సహకారాలు అందించడం కోసం ఎల్ఎస్‌యుఎం కంపెనీ ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి లీలా వెంకటశేషాద్రి అన్నారు. మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి లీలా వెంకటశేషాద్రి, లీగల్ సర్వీస్ యూనిట్ ఫర్ మావోనియ కమిటీ సభ్యులు పట్టణ శివారులోని శాంతిరామ్ మెడికల్ కళాశాలలో ఉన్న మానసిక వికలాంగుల విభాగాన్ని తనిఖీ చేశారు. వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, శేషసాయి, జీవన్‌కుమార్, శాంతిరామ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.వసంత్ ఆర్యవాన్, డా.మధుసూదన్‌రెడ్డి, డా.పీఎస్ మూర్తి, డా.సింధు, రామచంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా సచివాలయాలు



ప్రారంభానికి నోచుకోని గోకవరం సచివాలయం

కొత్తపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలు అలంకారప్రాయంగా మారాయి. కొత్తపల్లి మండలంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 11 గ్రామ సచివాలయాలు నిర్మించాల్సి ఉండగా... నేటికీ కేవలం నాలుగు సచివాలయాలు మాత్రమే పూర్తి చేశారు. మిగతా ఏడు గ్రామ సచివాలయాలు వివిధ దశల్లో నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అయితే పూర్తయిన నాలుగు సచివాలయాల్లో దుద్యాల, ఎదురుపాడు సచివాలయాల్లో మాత్రమే స్థానిక ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అట్టహాసంగా ప్రారంభించారు. అయితే పూర్తయిన గోకవరం, కొత్తపల్లి సచివాలయాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. దీంతో అధికారులు సిబ్బంది, ప్రస్తుతం ఉన్న చిన్నపాటి గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న సచివాలయాలను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకర మలుపులు

బండిఆత్మకూరు మే27 (ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరు మండలంలో మలుపులు ప్రమాదకరంగా మారాయి. సూచిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని వారధి వంతెన, ఏ కోడూరు గ్రామ శివార్లలోని రెండు మలుపులు, పార్నపల్లె కెసీ పంట కాలువ మలుపు, బండిఆత్మకూరు సుంకులమ్మ ఆలయ సమీపాన ఉన్న మలుపు, సంతజూటూరు బస్టాండ్ వద్ద మలుపు, పెద్దదేవళాపురం బస్టాండ్ సమీపాల్లోని రెండు మలుపులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. సంతజూటూరు కాశిరెడ్డి నాయన ఆశ్రమ మలుపులో కారు అతి వేగంగా వచ్చి రోడ్డు పక్కన వెళ్తున్న రామలక్ష్మమ్మ అనే మహిళను ఢీ కొనటంతో అక్కడికక్కడే మృతిచెందగా, సంతజూటూరు ఏసేపు పొలం వద్ద ఉన్నమలుపులో ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రాంతానికి చెందిన నాగరాజు అనే యువకుడును కారు ఢీ కొనటంతో రెండు నెలల క్రితం మృతి చెందాడు. ఇలా ఏటా పదుల సంఖ్యలోనే మలపుల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.


సంతజూటూరు కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద ప్రమాదాలకు నిలయంగా మారిన మలుపు

సమస్యలు పరిష్కరించండి

నందికొట్కూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ఉన్న జగన్న కాలనీ లేఔట్ వన్‌లో నీటి సమస్య కరెంటు సమస్య పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవాం జగనన్న కాలనీలో సీపీఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా కలనీవాసులు మాట్లాడుతూ గత వారం రోజులగా నీరు రాకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రెండు విద్యుత్ మోటార్లు మరమ్మతులకు గురైనన అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బేబికి వినతి పత్రం అందజేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలో తాగునీరు, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు షేక్ మహబూబ్, మాలిక్ బాషా, బాలరాజు, అల్లిమాభి, మా బాషా, జమల్ బాషా పాల్గొన్నారు.

మహానందిలో దంచి కొట్టిన వర్షం

మహానంది, మే 27 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలంలో తుపాన్ ప్రభావం వల్ల వర్షం దంచి కొట్టింది. మండలంలో రైతులు విస్తారంగా సాగు చేసే అరటి పంటకు ఎంతో మేలు చేకూర్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పుణ్య క్షేత్రమైన మహానందిలో ప్రధాన వీధులన్నీ జలమయయ్యాయి. గాజులపల్లిలో మండల ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి వర్షం వల్ల ఒరిగిపోయిన విద్యుత్త్ స్తంభాలను సిబ్బంది సహాయంతో తిరిగి యధాస్థితికి తెచ్చారు.

రిజర్వేషన్ అమలు చేయాలి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పదోన్నతుల్లో ఎస్టీ ఉపాధ్యాయులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పారదర్శకంగా అమలు చేయాలని షెడ్యూల్డ్ ట్రైబ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కోరారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోర్లసుధాకర్, కాశంగిరికుమార్‌లు మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్‌ల పదోన్నతుల కోసం విడుదల చేసిన వివిధ సబ్జెక్టుల సీనియారిటీ జాబితాలో ఒక్క ఎస్టీ ఉపాధ్యాయుని పేరు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నం.5 ప్రకారం అన్ని కేడర్‌ల పదోన్నతుల్లో రిజర్వేషన్ వర్తింపజేసి ఎస్టీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్టీటీఎఫ్ నాయకులు ధరణి ఉపేంద్ర, మాతృనాయక్, రామకృష్ణ, కేశాలునాయక్, నాగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బండిఆత్మకూరు, మే27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదేవళాపురం గ్రామ శివారులో వెలసిన ఏకశిలా అభయాంజనేయుడికి మంగళవారం అమవాస్య పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు శివరాజునాయక్, నాగేశ్వరావునాయక్, అర్చకులు వేకువజామునసే స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించి ఆకు పూజలు, కాయ కర్పూరాలు సమర్పించారు. కార్యక్రమంలో తేజేశ్వరనాయక్, ఈశ్వర్‌నాయక్, శివనాయక్, నాగరాజు, శివన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం


మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

వెలుగోడు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంతకందాల గ్రామంలో గోపాల స్వామి గుడి ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా మంగళవాకం దేవతా మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కారక్రమంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.

భూపనపాడు చెరువులో చేపల దోపిడీ



పాణ్యం, మే 27 (ఆంధ్రజ్యోతి) : భూపనపాడు గ్రామ పంచాయతీ ఆదాయానికి గండిపడుతోంది. ప్రతి యేటా గ్రామ సమీపంలో ఉన్న చెరువును వేలం వేసి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి ఖర్చు చేయాలి. కాని ఇక్కడ మాత్రం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల ఎలాంటి వేలాలు వేయలేదు. వైసీపీ నాయకులు చేపలు యధేచ్ఛగా అమ్ముకుంటూ తమ జేబులు నింపుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తర్వాత కూడా వైసీపీ విధానాలే అమలవుతున్నాయి. గత ఐదేళ్లలో వేలం లేదు కాబట్టి ఇప్పుడు మా ప్రభుత్వం వచ్చింది మేమూ ఇలాగే చేస్తామని స్థానిక టీడీపీ నాయకుడు పేర్కొనడం గమనార్హం. 2018లో దాదాపు రూ. 2,81లక్షల ఆదాయం వచ్చింది.

వేలాలకు పంచాయతీ తీర్మానం చేసింది

చెరువులో చేపలు పట్టుకోవడానికి గ్రామ పంచాయతీ తీర్మానం చేసింది. పంచాయతీ నిధులు రూ. 34 వేలు మత్స్య శాఖకు చలానా రూపంలో చెల్లించాం. ఈమేరకు డీపీవో వేలాలకు 2025 ఫిబ్రవరి 12న తేదీని ఖరారు చేశారు. స్థానిక టీడీపీ నాయకుడు పిళ్లై హనుమంతు దౌర్జన్యంగా చేపలు పట్టి అమ్ముకుంటున్నాడు. దీనిపై పలు మార్లు హెచ్చరించినా వినకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం.

- చంద్రమౌళీశ్వర గౌడ్, డిప్యూటీ ఎంపీడీవో

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఆర్డీవో



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కేపీ నరసింహులు

కోవెలకుంట్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డోన్ ఆర్డీవో కేపీ నరసింహులు హెచ్చరించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కంపమల్ల గ్రామానికి చెందిన ఓ రైతు తన ఇంటి పక్క స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశాడు. దాంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్డీవో గ్రామానికి వచ్చారు. కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో వరప్రసాదరావు, మైనరు ఇరిగేషన్ డీఈ తేజోవతి, ఈవోఆర్డీ ప్రకాశ్‌నాయుడు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రూ.7.92 కోట్లతో 40 పాఠశాలల అభివృద్ధి



చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో ర్యాంపును పరిశీలిస్తున్న జిల్లా సమగ్రశిక్ష ఏపీడీ

చాగలమర్రి, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎంశ్రీ కింద రూ.7.92 కోట్లతో 40 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టామని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ప్రేమంత్‌కుమార్ అన్నారు. మంగళవారం చాగలమర్రి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ర్యాంపులు, కంప్యూటర్లు, శుద్ధజల కేంద్రాలు, క్రీడా మైదానాలు, ల్యాబ్‌లు తదితర అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో రూ.5 లక్షలతో మొదటి విడతగా పలు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ హుసేన్‌సా, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ జగన్‌మోహన్‌రెడ్డి, సైట్ ఇంజనీర్ చిన్నమదార్, ఉపాధ్యాయుడు లక్ష్మయ్య పాల్గొన్నారు.

బయోమెట్రిక్ తప్పనిసరి



బయోమెట్రిక్ కిట్‌ను పరిశీలిస్తున్న ఏపీఎం దాసన్న

ఉయ్యాలవాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను సూక్ష్మ ఆర్థిక రుణ ప్రణాళిక సిద్ధం చేయడానికి బయోమెట్రిక్ తప్పకుండా వేయించాలని వెలుగు ఏపీఎం దాసన్న తెలిపారు. మంగళవారం ఉయ్యాలవాడలోని పొదుపు మహిళలతో బయోమెట్రిక్ వేయించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 540 పొదుపు గ్రూపులు ఉండగా 279 గ్రూపులు ఈ ఏడాది సూక్ష్మ ఆర్థిక రుణ ప్రణాళికకు అర్హత సాధించాయన్నారు. ఇప్పటి వరకు 15గ్రూపులకు బయోమెట్రిక్ పూర్తిచేశామన్నారు. కార్యక్రమంలో సీసీ గంగన్న, సిబ్బంది ఉన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలకు సరఫరా చేసే నిత్యావసర వస్తువులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో డీలర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్1 నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎండీయులను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా సరుకులు పంపిణీ చేయాలన్నారు. అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు పుల్లయ్య, వీఆర్వోలు, డీలర్లు, పాల్గొన్నారు.

తడిసిన మొక్కజొన్న

చాగలమర్రి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షం కురిసింది. సర్వీసు రహదారులు, పంట పొలాల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం తడిచి దెబ్బతింది. అకాల వర్షంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రైతులు పట్టలు కప్పిన వర్షపు నీరు ప్రవహించడంతో కొర్ర, నువ్వు పంటలు దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లింది.

రుద్రవరంలో 47.8 ఎంఎం వర్షపాతం నమోదు

రుద్రవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షపాతం 47.8 మి.మీగా నమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు మంగళవారం తెలిపారు. రుద్రవరం, కోటకొండ, ఆలమూరు గ్రామాల్లో ధాన్యం తడిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పుట్టపెద్దమ్మకు పూజలు

బేతంచెర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల-బనగానపల్లె రహదారి సమీపంలో వెలసిన పుట్టపెద్దమ్మ అమ్మవారికి భక్తులు మంగళవారం పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. ప్రసాదాలు అందజేశారు.

31న విగ్రహ ప్రతిష్ఠ

ప్యాపిలి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగమర్రి గ్రామంలో ఈ నెల 31న వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు ధార్మిక ప్రవచనాలు, సాంస్కృతిక , స్వామి విగ్రహ ఊరేగింపు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

'జుర్రేరు' శుద్ధీకరణ

- శరవేగంగా పనులు
- తొలి విడతలో రూ.2 కోట్లు
- మురుగునీరు వాగులో కలువకుండా చర్యలు
- పర్యవేక్షిస్తున్న అధికారులు

బనగానపల్లె, మే 27 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పట్టణంలోని జుర్రేరు వాగు అత్యంత ఉపయోగకరంగా ఉండేది. రానురాను మురుగునీరు వాగులోకి రావడంతో అపరిశుభ్రంగా మారింది.



వాగులో సాగుతున్న అండర్ డ్రైనేజీ పనులు

పట్టణంలోని ఈద్గానగర్ కాలనీ, శివనందినగర్, పాతబస్టాండ్ పరిసర ప్రాంతాల్లో జుర్రేరు వాగు పారుతోంది. ముఖ్యంగా పాతబస్టాండ్‌లోని పండ్ల వ్యాపారులు కుళ్లిపోయిన పండ్లు, తీసుకువచ్చి వేస్తున్నారు. అలాగే పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు కూడా చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు తీసుకు వచ్చి వేస్తుండడంతో జుర్రేరు వాగు కలుషితంగా మారింది. జుర్రేరు వాగు ముళ్ల కంపలతో నిండిపోయింది. వాగు వెంట నడవాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. వైసీపీ హయాంలో అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతో అనేక అక్రమ కట్టడాలు వెలిశాయి. దీంతో పూర్తిగా కుచించుకుపోయింది. ఒక వేళ పైభాగంలో పెద్ద వర్షం వస్తే ఆక్రమణల వల్ల పట్టణంలోకి వరదనీరు వచ్చే ప్రమాదం ఉంది.

టీడీపీ అధికారంలోకి రావడంతో..

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జుర్రేరువాగు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. శుద్ధీకరణ పనుల్లో భాగంగా రూ.20లక్షలతో మైనర్ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో



జుర్రేరు వాగులో పారుతున్న మురుగునీరు

జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేశారు. అనంతరం మైనర్ ఇరిగేషన్ అధికారులతో కొలతలు వేయించారు. ఆక్రమణలు తొలగించడానికి అధికారులు నోటీసులు ఇచ్చేందుకు సమయాత్తమవుతున్నారు.

రూ.2 కోట్లతో అండర్ డ్రైనేజీ పనులు

జంగిల్ క్లియరెన్సు పనులు పూర్తి కావడంతో పంచాయతీరాజ్ అధికారుల పర్యవేక్షణలో రూ.2కోట్లతో పట్టణంలో అండర్ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయి. జుర్రేరు వాగు వెంట 2.5 కిలో మీటర్ల మేరకు తొలివిడతగా పనులు కొనసాగుతున్నాయి. పట్టణంలోని మురుగునీరు జుర్రేరు వాగులో కలవకుండా పనులు ముమ్మరంగా ఒకవైపు సాగుతున్నాయి. తొలివిడత అండర్ డ్రైనేజీ పనులు పూర్తయితే రెండో వైపు కూడా చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయిన వెంటనే పట్టణ ప్రజలకు వాకింగ్ ట్రాక్‌ను నిర్మించనున్నారు. ఈ పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నార.

ముమ్మరంగా పనులు

జుర్రేరువాగు శుద్ధీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. తొలివిడతగా రూ.2 కోట్లతో పనులు చేపట్టాం. ఈ పనులు పూర్తి అయిన వెంటనే రెండో వైపు అండర్ డ్రైనేజీ పనులు పూర్తి చేసి జుర్రేరు వాగును పూర్తిగా శుద్ధీకరిస్తాం.

- నాగశ్రీనివాసులు, డీఈ, పంచాయతీరాజ్

డ్రైనేజీ పనులు ప్రారంభం



ఆటో నగర్‌లో పనులు చేస్తున్న కార్మికులు

డోన్ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆటో నగర్‌లో డ్రైనేజీ కాలువల పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'తవ్వారు.. వదిలేశారు' అనే కథనాన్ని ప్రచురించింది. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టరుకు ఆదేశాలు జారీచేయడంతో హుటాహుటిన పనులు ప్రారంభించారు. కాలనీ వాసులు 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు మాట్లాడుతూ పనులు ఆలస్యమైనది వాస్తవమేనన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేస్తాం.

ప్రధాని ఫొటో ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు ప్రధాని చిత్రపటాన్ని అందిస్తున్న బీజేపీ నాయకులు

డోన్ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు సంధు వెంకట రమణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఓ.కిరణ్ కోరారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కే.నాగమణికి ప్రధాని చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బద్రి సుధాకర్, నాయకులు విజయభాస్కర్, కామిశెట్టి శశివర్ధన్ పాల్గొన్నారు.

నేడు మద్దిలేటి స్వామి హుండీ లెక్కింపు

బేతంచెర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామాంజనేయులు మంగళవారం తెలిపారు. హుండీ లెక్కింపు దేవాదాయ శాఖ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- హౌసింగ్ పీడీ హరిగోపాల్

ఆళ్లగడ్డ, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉంటారని ఆళ్లగడ్డ మండల స్పెషల్ ఆఫీసర్, హౌసింగ్ పీడీ హరిగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక రాంలింగారెడ్డి కల్యాణ మండపంలో యోగాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్‌ఖాన్, అధికారులు పాల్గొన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళి



నెహ్రూకు నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ నిర్వాహకుడు

బేతంచెర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని పట్టణంలోని గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి గ్రంథాలయ అధికారి మధుశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సమ్మర్ ఒరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు, కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలగిన సందిగ్ధత

- రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



సమావేశంలో పాల్గొన్న ధార్మిక సంఘాల ప్రతినిధులు

కొలిమిగుండ్ల, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్.చెన్నంపల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో నెలకొన్న సందిగ్ధత ధార్మిక సంఘాల రంగ ప్రవేశంతో తొలగింది. రామాలయం ప్రతిష్ఠ ఉత్సవాలు ఈనెల 29 నుంచి 31వరకు యథావిధిగా జరుగుతాయని ధార్మిక సంఘం సభ్యులు మంగళవారం వెల్లడించారు. వేడుకలకు రాజకీయ రంగు పులుము కోవడంతో వాయిదా వేస్తున్నట్లు సోమవారం గ్రామస్థులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి విరజానందస్వామి ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామపెద్దలు, అధికారులు, ధార్మిక సంఘాల ప్రతి నిధులతో మాట్లాడారు. పలువురు ధార్మిక సంఘం సభ్యులు మంగళవారం ఎస్.చెన్నంపల్లె గ్రామానికి చేరుకొని గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు. రాజకీయాలకు తావులేకుండా ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించాలని తీర్మానించారు. పలువురు పీఠాధిపతులు పాల్గొనే అవకాశం ఉన్నట్లు ఆర్‌ఎస్‌ఎస్, సమరసత సభ్యులు వెల్లడించారు.

పొగాకు కంపెనీలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రామచంద్రుడు

ఆళ్లగడ్డ, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పొగాకు రైతును దగా చేస్తున్న కంపెనీలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు అన్నారు. మంగళవారం మండలంలోని మర్రిపల్లె, నరసాపురం, తిప్పారెడ్డిపల్లె, మిట్టపల్లె గ్రామాల రైతులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో 12 మండలాల్లో 30 వేల ఎకరాల్లో పొగాకును సాగు చేశారన్నారు. కొన్ని కంపెనీలు ఒప్పందాలను చేసుకొని క్వింటాకు రూ. 18వేల అమలు చేయక పోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో రైతులు సుబ్బ నరసయ్య, లక్ష్మీనరసయ్య సుబ్రమణ్యం ఓబులేసు, బాష తదితరులు పాల్గొన్నారు.

రాచెర్లలో రాష్ట్ర స్థాయి రాతిదూలం పోటీలు

ప్యాపిలి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచెర్ల గ్రామంలో వచ్చేనెల 1న రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో సీతారాములు, హనుమాన్ విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోటీల్లో గెలుపొందే వృషభాలకు వరుసగా రూ.80వేలు, రూ.60వేలు, రూ.40వేలు, రూ.30వేలు, 20వేలు, రూ.15 వేలు, రూ.10వేలు, రూ.6వేలు, రూ.5వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వివరాలకు 9573082338 నెంబరును సంప్రదించాలని కోరారు.

కౌలుకార్డుతో ప్రయోజనాలు

రుద్రవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): కౌలుకార్డు తీసుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతాయని ఏవో సుమతి తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో 1081 కౌలు కార్డులు మంజూరు చేయాలని లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు 21కౌలు కార్డులు మంజూరు చేశామన్నారు. భూమి కౌలుకు తీసుకున్న ప్రతి రైతు కౌలుకార్డు పొందాలని ఆమె అన్నారు. ఆయా సచివాలయాల్లో మంజూరైన 300 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నామని ఆమె తెలిపారు.

ముగిసిన పది సప్లిమెంటరీ పరీక్షలు

చాగలమర్రి, మే 27 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పది సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ శాస్త్రి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంస్కృతం పరీక్షకు పది మంది విద్యార్థులకుగాను ఆరుగురు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో డిపార్టుమెంటల్ అధికారి జయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుకాణదారులపై చర్యలు తప్పవు

చాగలమర్రి, మే 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దుకాణదారులు కాలం చెల్లిన పురుగుమందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రంగనేతాజీ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 రైతు సేవా కేంద్రాల పరిధిలో గల 500 మంది రైతుల పొలాల్లో 516 మట్టినమూనా శాంపిల్స్‌ను సేకరించామన్నారు. రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఏఈవో మంజుల, వీహెచ్‌ఏలు ఉన్నారు.

ఐదు గ్రామాలకు ఒకే వీఆర్వో

చాగలమర్రి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు గ్రామాలకు ఒకే వీఆర్వో విధులు నిర్వహిస్తున్నారు. వీఆర్వోల కొరతతో ఆయా గ్రామాల ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. వీఆర్వో వెంకట్రామిరెడ్డి నేలంపాడు, పెద్దబోధనం, చిన్నబోధనం, రాంపల్లె, శెట్టివీడు గ్రామాలకు వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. వీఆర్వో ఏ గ్రామంలో ఉంటారో అర్థం కావడం లేదని, చిన్న పనికి కూడా రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ వీఆర్వోలను కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, మే 27 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలో పేట్నికోట గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బోయ నాగేశ్వరావు(40) ఈనెల 20న నాపరాతి గనిలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. మృతుడి భార్య బోయ నాగేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహానాడుకు తరలిన నాయకులు

కడపలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న మహానాడుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ , డోన్‌లో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, ముఖ్య అనుచరులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

డోన్‌రూరల్/బనగానపల్లె/ కొలిమిగుండ్ల/ అవుకు/ సంజామల, ఆంధ్రజ్యోతి



డోన్‌రూరల్: మహానాడు సభకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



బనగానపల్లె: టీడీపీ మహానాడు సభలో టీడీపీ కార్యకర్తలతో మంత్రి బీసీ జనార్దనరెడ్డి



డోన్ రూరల్: మహానాడులో పాల్గొన్న ధర్మవరం సుబ్బారెడ్డి



సంజామల నుంచి కడపకు వెళ్తున్న టీడీపీ నాయకులు



మహానాడులో బనగానపల్లె నాయకులు



అవుకు నుంచి మహానాడుకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు



కొలిమిగుండ్ల నుంచి మహానాడుకు బయలుదేరుతున్న వీఆర్ లక్ష్మిరెడ్డి, నాయకులు



మహానాడులో పాల్గొన్న టీడీపీ డోన్ నాయకులు